పేదల గృహ నిర్మాణంపై వివక్ష

- ఇళ్ల నిర్మాణానికి పీఎం ఏవైజీ 2.0 తో లింక్
- కొత్త నిబంధనలతో పాత లబ్ధిదారులపై కుట్రలు
- పాత బిల్లుల బకాయిలపై కొరవడిన స్పష్టత
- కొత్త లబ్ధిదారులకు మాత్రమే రూ.4 లక్షలు
- నియోజకవర్గంలో వివిధ దశల్లో 5,541 గృహాలు


నిడదవోలు మండలం సమిశ్రగూడెంలోని జగనన్న కాలనీలో నిర్మాణంలో ఉన్న గృహాలు


సమిశ్రగూడెంలో పునాది దశలో నిలిచిపోయిన ఇల్లు

నిడదవోలు రూరల్: కూటమి ప్రభుత్వం తాజాగా తీసుకొచ్చిన గృహనిర్మాణ మార్గ దర్శకాలు సొంతిళ్లు లేని పేద, మధ్య తరగతి వర్గాలకు శాపంలా మారాయి. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పేదలకు మంజూరు చేసిన గృహాలపై ప్రస్తుత ప్రభుత్వం వివక్ష చూపుతోంది. గతంలో మంజూరై నిర్మాణంలో ఉన్న గృహాలకు పూర్తయిన మేర బిల్లులు చెల్లించకుండా కుట్ర పన్నుతోంది. గృహ నిర్మాణాలకు ప్రధానమంత్రి అవాస్ యోజన-గ్రామీణ్ 2.0 ను అనుసంధానం చేయడం ద్వారా ఇప్పటికే లబ్ధిదారులుగా ఉన్న వారిపై కక్ష సాధింపులకు తెర తీస్తోంది.

పేదల సొంతింటి కల..

ఇల్లు లేని ప్రతి పేద కుటుంబానికీ సొంతిల్లు నిర్మించి ఇవ్వాలనే లక్ష్యంతో గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చర్యలు చేపట్టారు. జగనన్న కాలనీల పేరుతో గ్రామాల్లో ప్రభుత్వం కొత్త ఊళ్లను నిర్మించింది. చాలా గ్రామాల్లో ఈ నిర్మాణాలకు టీడీపీ నాయకులు అప్పట్లో న్యాయపరమైన అడ్డంకులు కూడా సృష్టించారు. వాటన్నింటినీ అధిగమిస్తూ నాటి జగన్ ప్రభుత్వం ఇళ్ల నిర్మాణాలు చేపట్టింది. నియోజకవర్గంలోని నిడదవోలు పట్టణం, నిడదవోలు, పెరవలి, ఉండ్రాజవరం మండలాల పరిధిలో 12,130 గృహాలు మంజూరవగా, వాటిలో 6,589 గృహ నిర్మాణాలు పూర్తయ్యాయి. మరో 5,541 ఇళ్ల నిర్మాణాలు వివిధ దశల్లో ఉన్నాయి. అలాగే ప్రధానమంత్రి అవాస్ యోజన (పీఎంఏవై) ద్వారా 4,852 ఇళ్లు మంజూరుచేయగా, వాటిలో 4,100 గృహాల నిర్మాణాలు పూర్తి చేశారు. మిగిలిన 782 ఇళ్లు వివిధ నిర్మాణ దశల్లో ఉన్నాయి. పీఎంఏవై కింద గతంలో గృహ లబ్ధిదారులకు రూ.1.50 లక్షల ఇంటి రుణం, రూ.30 వేలు ఉపాధి హామీ పథకంలో అనుసంధానం, రూ.50 వేల బ్యాంకు రుణంగా మొత్తంగా రూ.2.30 లక్షల మేర ఆర్థిక సాయం అందేది. కూటమి ప్రభుత్వం తాజాగా ఇచ్చిన ఉత్తర్వుల్లో ఆ మొత్తాన్ని రూ.4 లక్షలకు పెంచింది. కొత్తగా మంజూరయ్యే లబ్ధిదారులకు రూ.4 లక్షలు వర్తించేలా ఉత్తర్వులు ఇవ్వడంతో గతంలో మంజూరై ఇంటి నిర్మాణాలు పూర్తి కాని లబ్ధిదారులు తమ పరిస్థితి ఏమిటని ప్రశ్నిస్తున్నారు.

కొత్త నిబంధనలతో కక్ష సాధింపు

పేదల గృహ నిర్మాణానికి కూటమి ప్రభుత్వం కొత్త నిబంధనలు తీసుకొచ్చింది. ప్రధాన మంత్రి అవాస్ యోజన-గ్రామీణ్ 2.0ను అనుసంధానం చేసి, ఇకపై ప్రతి గృహ రూ.4 లక్షల చొప్పున సాయం చేసేలా నిర్ణయించింది. ఇందులో రాష్ట్రం వాటా రూ.40 శాతం, కేంద్రం వాటా 60 శాతం. గతంలో లబ్ధిదారునికి ఇస్తున్న మొత్తం కంటే ఇది ఎక్కువ కదా అని అనుకుంటే పప్పులో కాలేసినట్టే. రాష్ట్ర ప్రభుత్వం తాజాగా తీసుకొచ్చిన ఈ నిబంధన కొత్త లబ్ధిదారులకు మాత్రమే వర్తిస్తుంది. ఈ నిర్ణయంతో ఇప్పటికే ఇళ్ల నిర్మాణం చేపట్టిన లబ్ధిదారులు ఆందోళనకు గురవుతున్నారు. గత ప్రభుత్వంలో ఇచ్చిన ఇళ్లపై ఇంత కక్ష సాధింపు చర్యలకు పాల్పడడం సరి కాదని వాపోతున్నారు. ఆర్థిక స్తోమత లేకపోవడంతో ఇళ్ల నిర్మాణం పూర్తి కాలేదని, తమకు కూడా కొత్త నిబంధనలు వర్తింపజేయాలని పాత లబ్ధిదారులు కోరుతున్నారు. ప్రభుత్వం ఏదైనా ఇలా పక్షపాత ధోరణి అవలంబించడం ఎంత వరకూ సబబు అని ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త నిబంధనలతో నిడదవోలు నియోజకవర్గంలో వివిధ నిర్మాణ దశల్లో ఉన్న 5,541 ఇళ్ల లబ్ధిదారుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. పెండింగ్ బిల్లులు మంజూరుపై కూడా స్పష్టత ఇవ్వకపోవడంతో లబ్ధిదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

నిడదవోలు నియోజకవర్గంలో గత ప్రభుత్వంలో ఇళ్ల నిర్మాణాల వివరాలు

మండలం	మంజూరైనవి	వివిధ దశల్లో ఉన్నవి	పూర్తి చేసినవి
నిడదవోలు మండలం	3,762	2,134	1,628
నిడదవోలు పట్టణం	3,180	1,655	1,525
పెరవలి	2,055	461	1,594
ఉండ్రాజవరం	3,133	1,291	1.842

నిర్మాణాలు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలి



ఆర్థిక స్తోమత లేకపోవడంతో మాకు మంజూరైన ఇల్లు పునాదుల దశలోనే ఆగిపోయింది. నిర్మాణం జరుగుతున్న ప్రతి ఇంటికీ రూ.4 లక్షలు వర్తింపజేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. పెండింగ్ బిల్లులు కూడా వెంటనే విడుదల చేయాలి.

– పల్లపు నాగమణి, సమిశ్రగూడెం

ప్రభుత్వాదేశాల ప్రకారం చర్యలు



గత ప్రభుత్వంలో వివిధ దశల్లో, పూర్తి చేసిన గృహాల వివరాలను ప్రభుత్వానికి పూర్తిస్థాయిలో అప్‌లోడ్ చేశాం. వాటి బిల్లుల బాపతు నిధులు విడుదలకు ప్రభుత్వం నుంచి ఇంకా ఆదేశాలు రాలేదు. ప్రస్తుత ప్రభుత్వ ఆదేశాల ప్రకారం ప్రధాన మంత్రి అవాస్ యోజన-గ్రామీణ్ 2.0 ప్రకారం కొత్తగా గృహ నిర్మాణాలు చేపట్టేందుకు చర్యలు చేపడుతున్నాం.

– ఎస్.చంద్రశేఖర్, హౌసింగ్ డీఈ, నిడదవోలు

క్లుప్తంగా

సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి అభిషేకం


వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి

ఉండ్రాజవరం: శ్రావణమాసంలోని మంగళవారం సందర్భంగా ఉండ్రాజవరంలో కొలువైన శ్రీవల్లీ దేవసేన సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారికి పంచామృతాలతో అభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు తెల్లవారుజాము నుంచి పూజలు, అభిషేక కార్యక్రమంలో పాల్గొన్నారు.

పొగాకు రైతులకు ట్రేల పంపిణీ


రైతులకు ట్రేలు అందజేస్తున్న వేలం అధికారి హేమస్మిత, ఐటీసీ మార్కెటింగ్ మేనేజర్ జోషి

దేవరపల్లి: పొగాకు రైతులకు రాయితీపై పొగాకు బోర్డు ద్వారా ప్లాస్టిక్ ట్రేలు అందజేస్తున్నారు. స్థానిక పొగాకు వేలం కేంద్రం వద్ద మంగళవారం నర్సరీ రైతులకు ట్రేల పంపిణీని ప్రారంభించారు. ఐటీసీ మార్కెటింగ్ మేనేజరు జోషి , వేలం నిర్వహణాధికారి హేమస్మిత రైతులకు ట్రేలు అందజేశారు. ఈ సందర్భంగా జోషి మాట్లాడుతూ పొగాకు సాగు చేస్తున్న రైతులకు ఐటీసీ ద్వారా రాయితీపై ట్రేలు అందజేస్తున్నామన్నారు. బ్యారన్‌కు (4ఎకరాలకు) 400 ట్రేల చొప్పున నర్సరీలు కడుతున్న రైతులకు వాటిని అందజేస్తున్నట్టు తెలిపారు. ఒక్కొక్క ట్రేకు రూ.15.25 చొప్పున చెల్లించాలన్నారు. దేవరపల్లి వేలం కేంద్రంలో 45 వేల ట్రేలను రైతులకు అందజేస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో పొగాకు రైతు సంఘం అధ్యక్షుడు కరుటూరి శ్రీనివాసరావు, రైతులు, బోర్డు సిబ్బంది పాల్గొన్నారు.

గౌరవ వేతనం బకాయిల కోసం బీఎల్‌ఓల మొర

తాళ్లపూడి: సచివాలయాల్లో బూత్ లెవెల్ ఆఫీసర్లు (బీఎల్‌ఓ)గా అదనపు విధులు నిర్వహిస్తున్న తమకు ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం గౌరవ వేతనం బకాయిలు చెల్లించాలని పలువురు బీఎల్‌వోలు కోరారు. మండలంలో బీఎల్‌వోలుగా అదనపు విధులు నిర్వర్తిస్తున్న వీఆర్వోలు, వెల్ఫేర్, ఇంజినీరింగ్, జూనియర్ అసిస్టెంట్లు, మహిళా పోలీసులు మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ఏఎస్‌వో జె.వెంకటేశ్వరరావు, ఆర్‌ఐ రత్న కిశోర్‌లకు ఈమేరకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీఎల్‌వోలు మాట్లాడుతూ రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల ప్రకారం నాలుగేళ్లుగా ఓటర్ల జాబితాల సవరణ, క్లెయిమ్‌ల తయారీ, మార్పులు, చేర్పులు, అధార్ లింకేజీ, ఇంటింటి సర్వే వంటి విధులు నిర్వహిస్తున్నామన్నారు. అదనపు విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులకు ప్రతి మూడు నెలలకు రూ. 1,500 చొప్పున ఏడాదికి రూ.6 వేలు చెల్లించాల్సి ఉందన్నారు. అయితే గత నాలుగేళ్లలో కేవలం రెండు, మూడు త్రైమాసికాల వేతనం మాత్రమే చెల్లించారన్నారు. మిగిలిన బకాయిలు చెల్లించాలని వారు కోరారు.

గాలికుంటు నివారణ వాక్సిన్ విడుదల


గాలికుంటు నివారణ వ్యాక్సిన్‌ను విడుదల చేస్తున్న వైద్యులు, స్థానిక నాయకులు

పెరవలి: పశువులకు గాలికుంటు వ్యాధి సోకకుండా టీకాలు వేసే వ్యాధి నిరోధక మాసోత్సవానికి పశుసంవర్ధక శాఖ అధికారులు మంగళవారం శ్రీకారం చుట్టారు. ఈ వ్యాధి నివారణకు పశువులకు వేసే గాలికుంటు, బ్రూసెల్లా వాక్సిన్‌లను మంగళవారం పెరవలి పశువైద్యశాల వద్ద స్థానిక నాయకులతో కలసి పశువైద్యాధికారి చరణ్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని 6,900 పశువులకు సెప్టెంబర్ 19 వ తేదీ లోగా గాలికుంటు రాకుండా వ్యాక్సిన్లు వేస్తామన్నారు. ఇందుకోసం మండలంలోని అన్ని గ్రామాల్లోనూ పశు వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో సలాది శ్రీహరి, పిప్పర రవి, పశువైద్యాధికారులు పాల్గొన్నారు.

తుపాకులగూడెంలో సీసీ డ్రెయిన్ల నిర్మాణం


గ్రామంలో నిర్మాణంలో ఉన్న సీసీ డ్రెయిన్

తాళ్లపూడి: మండలంలోని పోచవరం పంచాయతీ పరిధిలోని తుపాకులగూడెం గ్రామ ఎస్సీ, బీసీ ఏరియాల్లో రూ.18 లక్షల వ్యయంతో సీసీ డ్రెయిన్ల నిర్మాణం చేపట్టినట్టు పోచవరం సర్పంచ్ కాకర్ల హేమలత తెలిపారు. గ్రామంలో జరుగుతున్న సీసీ డ్రెయిన్ల నిర్మాణాలను సర్పంచ్ హేమలత, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ వెంకటేశ్వరరావు మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతు గ్రామంలో 700 మీటర్ల పొడవైన సీసీ డ్రెయిన్ నిర్మాణాలు జరుగుతున్నాయన్నారు. పంచాయతీ సాధారణ నిధులను ఎస్సీ ఏరియాకు రూ.7.50 లక్షలు, బీసీ ఏరియాకు రూ.10 లక్షలు కేటాయించినట్టు వివరించారు. ఈ నిర్మాణాలతో గ్రామంలో డ్రైన్ల సమస్య పరిష్కారం అవుతుందన్నారు.

దోమల నియంత్రణపై అవగాహన ర్యాలీ


నల్లజర్ల పీహెచ్‌సీ వద్ద దోమల నియంత్రణపై అవగాహన ర్యాలీ


దేవరపల్లి పీహెచ్‌సీ వద్ద దోమల నివారణ దినోత్సవ ర్యాలీ చేస్తున్న సిబ్బంది

నల్లజర్ల: మంగళవారం ప్రపంచ దోమల నియంత్రణ దినోత్సవం సందర్భంగా నల్లజర్ల పీహెచ్‌సీ వద్ద నుంచి ఆరోగ్య సిబ్బంది అవగాహన ర్యాలీ నిర్వహించారు. దోమల ద్వారా వ్యాపించే వ్యాధులపై ఈ సందర్భంగా సీహెచ్‌ఓ ప్రసాద్ అవగాహన కల్పించారు. మలేరియా, డెంగీ తదితర దోమకాటు వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు చేపట్టాలని సిబ్బందికి సూచించారు. పీహెచ్‌సీ డాక్టర్ గంగాధరరావు మాట్లాడుతూ అనాఫిలస్ అనే ఆడ దోమ కుట్టడం వల్లే సీజనల్ జ్వరాలు సోకుతాయని 1897లోనే నిరూపించిన ఇంగ్లాండ్‌కు చెందిన సర్ రొనాల్డ్ రాస్ గొప్పతనాన్ని వివరించారు. దోమకాటు నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో ల్యాబ్ టెక్నీషియన్ షరీఫ్, క్షేత్ర సహాయకులు అన్నమ్మ, సత్యనారాయణ, వైద్య ఉద్యోగుల సంఘ నాయకుడు జీవీవీ ప్రసాద్ పాల్గొన్నారు.

దేవరపల్లి మండలంలో..

దేవరపల్లి: దోమల నివారణ దినోత్సవాన్ని మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో మంగళవారం నిర్వహించారు. దేవరపల్లి, గౌరీపట్నం, యాదవోలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారుల ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీలు జరిపారు. దోమల నిర్మూలనకు ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో వైద్యాధికారులు డి.సాంబశివరావు, సంజీవరావు, సిబ్బంది పాల్గొన్నారు. గౌరీపట్నంలో వైద్యాధికారి డాక్టర్ సతీష్, సీహెచ్‌ఓ చిన్నికృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు

- రూ.58 కోట్లతో నీటిశుద్ధి ప్లాంట్ ఏర్పాటు
- ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు


కొవ్వూరు హెడ్ వాటర్ వర్క్స్‌లో అధికారుల బృందంతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు

కొవ్వూరు: పట్టణంలో తాగునీటి సమస్య శాశ్వత పరిష్కారానికి రూ.58 కోట్ల వ్యయంతో గోదావరి జలాల శుద్ధి, నీటి సరఫరా ప్లాంట్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు ప్రకటించారు.గోదావరి నదిలో ఇన్‌టేక్ వెల్ ఏర్పాటు చేసే ప్రదేశాన్ని మంగళవారం ఆయన నీటిపారుదల, ఆర్‌డబ్ల్యూఎస్, పబ్లిక్ హెల్త్ శాఖల ఎస్ఈలతో కలసి పరిశీలించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ పట్టణంలో తాగునీటి ప్లాంట్ ఏర్పాటుకు అవసరమైన మూడెకరాల భూమిని మునిసిపాలిటీ ద్వారా సమకూర్చుకున్నామన్నారు. అలాగే గోదావరి నుంచి చాగల్లు, కొవ్వూరు రూరల్ మండలాల ప్రజలకు తాగునీటి సరఫరాకు రూ.96 కోట్లతో అంచనాలు తయారు చేసి సంబంధిత శాఖ మంత్రికి అందజేశామని తెలిపారు.కొవ్వూరు పట్టణంలోనే ఏర్పాటు చేసేఈ ప్లాంట్‌కు ఐదెకరాల స్థలం అవసరమని ఎమ్మెల్యే చెప్పారు. ఇన్ టేక్ వెల్ ఏర్పాటుకు అవసరమైన అనుమతులను జల వనరులశాఖను కోరామని పబ్లిక్ హెల్త్ ఎస్ఈ సుధాకర్ తెలిపారు. ఈ రెండు మండలాల కోసం ప్రతిపాదించిన తాగునీటి ప్రాజెక్ట్ ఇన్ టేక్ వెల్ ప్రదేశాన్ని పరిశీలించినట్టు ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ సత్యనారాయణ తెలిపారు. కాగా గోదావరి నదిలో ప్రస్తుతం ఉన్న ప్రాజెక్టులు, వంతెనలకు 500 మీటర్ల దూరంలో ఇన్ టేక్ వెల్ ఏర్పాటుకు అనుమతులు ఇవ్వడం కుదరదని జల వనరుల శాఖ ఎస్ఈ జి.శ్రీనివాసరావు స్పష్టం చేశారు. ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించవలసి ఉందన్నారు.

క్రిస్టియన్ జాయింట్ యాక్షన్ నూతన కమిటీ ఎన్నిక


క్రిస్టియన్ పాస్టర్స్ జాయింట్ యాక్షన్ నియోజకవర్గ నూతన కమిటీ


నియోజకవర్గ పాస్టర్ల జాయింట్ యాక్షన్ క్రిస్టియన్ కమిటీ

ఎన్‌సీ జేఏసీసీ నూతన కార్యవర్గం ఎన్నిక

నిడదవోలు రూరల్: క్రైస్తవ సంఘాలను బలోపేతం చేయడంతో పాటు పాస్టర్లకు అండగా నిలిచేందుకు నూతన కార్యవర్గం పని చేయాలని క్రిస్టియన్ జాయింట్ యాక్షన్ నియోజకవర్గ గౌరవాధ్యక్షుడు రెవరెండ్ ఎంఎస్ ప్రసన్నకుమార్ సూచించారు. మండలంలోని సమిశ్రగూడెం సీయోను ప్రార్థనా మందిరంలో క్రిస్టియన్ జాయింట్ యాక్షన్ నిడదవోలు నియోజకవర్గ నూతన కార్యవర్గాన్ని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడిగా పి.ఒబేద్యా (సమిశ్రగూడెం), ఉపాధ్యక్షుడిగా ఎం.రవికుమార్, ప్రధాన కార్యదర్శిగా జె.సుధాకర్, సంయుక్త కార్యదర్శిగా యు.చిన్నరాజు, కోశాధికారిగా బి.మనోహరం, సంయుక్త కోశాధికారిగా బి.శామ్యూల్ ఎన్నికయ్యారు. నూతన కమిటీని పాస్టర్లు అభినందించారు.

నిడదవోలు: నియోజకవర్గ పాస్టర్ల జాయింట్ యాక్షన్ క్రిస్టియన్ కమిటీ (ఎన్‌సీ జేఏసీసీ) నూతన కార్యవర్గాన్ని మంగళవారం పట్టణంలోని చినమంద చర్చిలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నిడదవోలు, ఉండ్రాజవరం, పెరవలి మండలాల పాస్టర్లు హాజరయ్యారు. నూతన అధ్యక్షుడిగా టి.సువర్ణరాజు, గౌరవాధ్యక్షుడిగా బి.నవీన్ కుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఎం .గుణ శామ్యూల్, ఉపాధ్యక్షుడిగా వి.రాంబాబు, కార్యదర్శిగా కె. షారోన్‌రాజు, సంయుక్త కార్యదర్శిగా అబ్బులు, ఎగ్జిక్యూటివ్ కార్యదర్శిగా కె. ప్రకాష్, కోశాధికారిగా పెద్దిరాజు, సంయుక్త కోశాధికారిగా బి. గాబ్రియేల్, సలహాదారుగా ఇశ్రాయేలు ఎన్నికయ్యారు.

'మానవత' ఆధ్వర్యంలో శాంతి ర్యాలీ



చాగల్లులో ర్యాలీ చేస్తున్న విద్యార్థులు


గోపాలపురంలో మానవత శాంతి ర్యాలీని ప్రారంభిస్తున్న ఎస్సై సతీష్‌కుమార్

చాగల్లు: మానవత సంస్థ ఆవిర్భావ వారోత్సవాల్లో భాగంగా ఆ సంస్థ మండల శాఖ ఆధ్వర్యంలో మంగళవారం చాగల్లులో శాంతిర్యాలీ నిర్వహించారు. కోల్‌కతాలో మహిళా జూనియర్ డాక్టర్‌పై అత్యాచారం, హత్యకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని, మృతురాలి ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతూ, ఇటీవల కేరళ ప్రకృతి విలయ తాండవంలో మృతుల ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతూ ర్యాలీ చేశారు. ర్యాలీ అనంతరం స్థానిక సుబ్రహ్మణ్య స్వామి ఆలయ ఆవరణలో పెద్దలు శాంతి సందేశం ఇచ్చి, శాంతి ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో చాగల్లు జెడ్పీ హైస్కూల్ ఉపాధ్యాయులు, విద్యార్థులు, మానవత సంస్థ డైరెక్టర్ బొడ్డు రాజు, అధ్యక్షుడు ప్రసాద్ , నిడదవోలు శాఖ అధ్యక్షులు బోసు ,సూర్యచంద్రరావు, సెక్రటరీ ముళ్లపూడి సోమరాజు, నాగేశ్వరావు, వలీ బేగ్ తదితరులు పాల్గొన్నారు.

గోపాలపురంలో..

గోపాలపురం: మానవత స్వచ్ఛంద సంస్థ మండల శాఖ సేవలు వెల కట్టలేనివని స్థానిక ఎస్సై కర్రి సతీష్‌కుమార్ అభినందించారు. మానవత సంస్థ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మంగళవారం గోపాలపురంలో శాంతి ర్యాలీ, నిర్వహించి మానవహారంగా ఏర్పడ్డారు. ఈ ర్యాలీని ప్రారంభించిన అనంతరం ఎస్సై మాట్లాడుతూ మానవత సంస్థ సభ్యులు రక్తదానం చేసి ఎంతో మంది ప్రాణాలు నిలబెడుతున్నారన్నారు. ఆపదలో ఉన్నవారికి అండగా నిలబడి భరోసా కల్పిస్తున్నారని కొనియాడారు. మానవత సంస్థ రాష్ట్ర సభ్యుడు బి.సత్యనారాయణ, చైర్మన్ జొన్నలగడ్డ రాంబాబు, మండలశాఖ అధ్యక్షుడు పప్పు సత్య కృష్ణారెడ్డి, గెడా జోగేంద్రప్రసాద్, సభ్యులు శర్వాణి, జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు పాల్గొన్నారు.

గెస్ట్ ఫ్యాకల్టీలకు దరఖాస్తుల ఆహ్వానం

కొవ్వూరు: స్థానిక బాలుర ప్రభుత్వ జూనియర్ కళాశాలలో లెక్కలు, రసాయన శాస్త్రం, ఎలక్ట్రానిక్స్ సబ్జెక్టులు బోధించేందుకు గెస్ట్ ఫ్యాకల్టీల కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని ప్రిన్సిపాల్ జి.సతీష్ మంగళవారం తెలిపారు. ఎమ్మెస్సీ మేథ్స్, కెమిస్ట్రీ, బీటెక్ ఈసీఈ పూర్తి చేసిన అభ్యర్థులు ఈనెల 23వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అలాగే తమ బయోడేటా, ఒరిజినల్ సర్టిఫికెట్లతో 24వ తేదీ ఉదయం పది గంటలకు కళాశాలలో నిర్వహించే ఇంటర్వ్యూ, డెమో క్లాసులకు హాజరు కావాలన్నారు. టీచింగ్ ఫ్యాకల్టీలుగా రిటైరైన అధ్యాపకులు కుడా అర్హులే అన్నారు.

నిడదవోలు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో..

నిడదవోలు: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఖాళీగా ఉన్న ఇంగ్లిష్, హిందీ గెస్ట్ లెక్చరర్ పోస్టులకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాల్ బి. మేరీసుజాత మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంఏ (ఇంగ్లిష్), ఎంఏ (హిందీ)లో ఉత్తీర్ణులైన అభ్యర్థులు ఈనెల 23వ తేదీలోగా కళాశాలలో తమ బయోడేటా, విద్యార్హతల ధ్రువీకరణ పత్రాలతో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈనెల 24వ తేదీ ఉదయం 11 గంటలకు అభ్యర్థులకు కళాశాలలో త్రీమన్ కమిటీ ద్వారా ఇంటర్వ్యూ, డెమో తరగతులు నిర్వహించి ఎంపిక చేస్తామని ప్రిన్సిపాల్ తెలిపారు.

మెడికో హత్యకు నిరసనగా కొవ్వొత్తుల ర్యాలీ


తాళ్లపూడిలో ఐక్య వేదిక ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కొవ్వొత్తుల ర్యాలీ

తాళ్లపూడి: కోల్‌కతాలో వైద్య విద్యార్థిని హత్యకు నిరసనగా మంగళవారం తాళ్లపూడిలో కొవ్వొత్తులతో నిరసన ర్యాలీ నిర్వహించారు. మండల ఉపాధ్యాయ, ఉద్యోగ, కార్మిక, పెన్షనర్ల ఐక్యవేదిక ఆధ్వర్యంలో తాళ్లపూడి బస్‌స్టాండ్ సెంటర్ వద్ద ప్రారంభమైన ఈ ర్యాలీ మెయిన్ రోడ్డు మీదుగా సాగింది. మృతురాలి ఆత్మకు శాంతి చేకూరాలంటూ వారంతా ప్రార్థించారు. కార్యక్రమంలో ఉద్యోగ సంఘాల జేఏసీ నాయకుడు జె.వెంకటేశ్వరరావు మండలంలోని ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘాలు, అంగన్‌వాడీ వర్కర్లు, వెలుగు, వైద్య సిబ్బంది, సచివాలయ సిబ్బంది, ఆశాలు, సీఐటీయూ, ప్రజాసంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

సేంద్రియ ఎరువుతో సంపద సృష్టి


నల్లజర్ల మండలం గంటావారిగూడెంలో సంపద కేంద్రాన్ని పరిశీలిస్తున్న సర్పంచులు, కార్యదర్శులు


అన్నదేవరపేటలోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం వద్ద సర్పంచులకు, పారిశుధ్య కార్మికులకు అవగాహన

నల్లజర్ల: సేంద్రియ ఎరువుల తయారీ ద్వారా సంపద సృష్టించి గ్రామాలను మరింతగా అభివృద్ధి చేసుకోవాలని ఎంపీడీఓ సింహాద్రి సూచించారు. మండలంలోని సర్పంచులు, కార్యదర్శులు, క్లాప్ మిత్రలకు మంగళవారం రెండో రోజు శిక్షణ కార్యక్రమం ఘంటావారిగూడెంలోని చెత్త నుంచి సంపద తయారీ(సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్) కేంద్రం వద్ద జరిగింది. వర్మీ కంపోస్టు తయారీపై వారికి అవగాహన కల్పించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ ప్రజలు తమ ఇళ్లలోని వ్యర్థాలను తడి,పొడి చెత్తలుగా వేర్వేరుగా ఉంచి పారిశుధ్య కార్మికులకు అందించి సహకరించాలన్నారు. ఆ చెత్తను సంపద తయారీ కేంద్రానికి తరలించి వానపాముల సహాయంతో ఎరువుగా తయారు చేసి రైతులకు విక్రయించాలన్నారు. రీసోర్సు పర్సన్‌లుగా బీవీ రత్నం, లక్ష్మీనారాయణ, హరికృష్ణ, వివిధ శాఖల అధికారులు వ్యవహరించారు.

తాళ్లపూడి: గ్రామాల్లో ఉత్పత్తి అయ్యే వ్యర్థాల నుంచి సంపదను ఎలా సృష్టించవచ్చో అనే అంశంపై సర్పంచులు దృష్టి సారించాలని ఎంపీడీవో వెంకటరమణ సూచించారు. మండలంలోని సర్పంచులు, కార్యదర్శులకు రెండో రోజు మంగళవారం శిక్షణ సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్‌పై ఇచ్చారు. అన్నదేవరపేట గ్రామంలోని సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ షెడ్ వద్ద చెత్త నుంచి సంపదను ఏ విధంగా సృష్టించవచ్చో వారికి చూపించారు. మండలంలోని పారిశుధ్య కార్మికులకు కూడా పాల్గొన్నారు. షెడ్ల నిర్వహణ, తడి చెత్త, పొడి చెత్త సేకరణ, వర్మీ కంపోస్ట్ తయారీ తదితర అంశాలపై పెద్దేవం కార్యదర్శి వై.అలేఖ్య సువర్ణల వారికి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీపీ జొన్నకూటి పోశిరాజు, సర్పంచులు ఎలిపే సుధారాణి, గండి రాంబాబు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

పెరవలి: మండలంలోని సర్పంచులు, కార్యదర్శులకు రెండో రోజు శిక్షణ కార్యక్రమం మంగళవారం నడుపల్లి గ్రామంలోని సంపద తయారీ కేంద్రాల వద్ద నిర్వహించారు. వారిని ఉద్దేశించి ఈఓపీఆర్‌డీ సీహెచ్ వెంకటరమణ మాట్లాడుతూ వ్యర్థాల నుంచి వర్మీ కంపోస్టు తయారీ విధానం గురించి వివరించారు. సంపద కేంద్రాల వలన కలిగే ప్రయోజనాల గురించి సెక్రటరీ చక్రవర్తి వివరించారు.

చాగల్లు: చెత్త నుంచి సంపద తయారీపై రెండో రోజు మంగళవారం మండలంలోని సర్పంచులకు, కార్యదర్శులకు చాగల్లులో శిక్షణ ఇచ్చారు. పంచాయతీకి వనరుల పెంపు, తడి చెత్త, పొడి చెత్త సేకరణ, వాటిని వేరు చేయడం, వర్మీ కంపోస్టు తయారీ వంటి అంశాలను రీసోర్స్‌పర్సన్లు వివరించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎంపీడీవో పి.నిర్మలకుమారి, విస్తరణాధికారి ఆర్. శ్రవణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉండ్రాజవరం: గ్రామ ప్రథమ పౌరుల బాధ్యతలను సర్పంచులు సమర్థవంతంగా నిర్వహించాలని ఎంపీపీ పొలాటి యల్లారేశ్వరి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సర్పంచులు, కార్యదర్శులకు మంగళవారం రెండోరోజు శిక్షణ కార్యక్రమం జరిగింది. అనంతరం వేలివెన్ను గ్రామంలోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని సర్పంచుల బృందం పరిశీలించింది. కేంద్రం నిర్వహణపై ఈవోపీఆర్డీ ప్రసాద్ అవగాహన కల్పించారు.

ఆంజనేయ విగ్రహ ప్రతిష్ఠకు భూమిపూజ

చాగల్లు: బ్రాహ్మణగూడెంలోని వేంకటేశ్వరస్వామి వారి ఆలయం వద్ద నిర్మించే అభయాంజనేయ స్వామి వారి విగ్రహానికి భూమిపూజ చేశారు. గ్రామానికి చెందిన విగ్రహ దాత దాపర్తి సత్యనారాయణ ఆధ్వర్యంలో 18 అడుగుల అభయాంజనేయ స్వామి విగ్రహాన్ని ఏర్పాటు చేయనున్నారు.